# నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

- అధికారులకు ఎమ్మెల్యే బాలరాజు ఆదేశం
- నిర్వాసిత కాలనీల్లో గడపగడపకు మన ప్రభుత్వం



గడపగడపకు కార్యక్రమంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

**బుట్టాయగూడెం:** పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత పునరావాస గ్రామాలకు తరలివచ్చిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెం సచివాలయ పరిధిలో నిర్మించిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కాలనీలైన టేకూరు, చీడూరు, గాజులగొంది, కొరుటూరు, సిరివాక గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నాలుగేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బాలరాజు గిరిజనులకు వివరించారు. టేకూరు నిర్వాసిత కాలనీలో నిర్మించిన గృహాలు నాణ్యతాలోపంగా ఉన్నాయని, పాఠశాల భవనం కూడా అసంపూర్తిగా నిర్మించారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం చీడూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజుతోపాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ పాల్గొన్నారు. అలాగే ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవని పీఓ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే భూమిలేని వారికి ఒక ఎకరం భూమి ఇప్పిస్తామని అధికారులు తమ గ్రామాన్ని ఖాళీ చేయించారని చెప్పారు. అయితే ఈ సమస్యపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం కొరుటూరు సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నిర్వాసితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు భూమికి భూమిగా ఇచ్చిన భూముల్లో సాగుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని నిర్వాసితులు కోరారు. ఆ భూముల్లో నిర్వాసితులు సాగు చేసుకునే విధంగా రెవెన్యూ, పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కొరుటూరు సచివాలయ పరిధిలోని 11 గ్రామాల్లోని కాలనీల్లో ఒక్కో గ్రామానికి రూ.3 లక్షల నిధులతో వాటర్ ప్లాంట్‌లు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడచిన నాలుగేళ్లలో కొరుటూరు సచివాలయ పరిధిలో ఉన్న 11 గ్రామాల్లోని నిర్వాసితులకు సుమారు రూ.8 కోట్ల 63 లక్షలు సంక్షేమ పథకాలకు నిధులు జమ చేయడం జరిగిందని అన్నారు. యువతీ యువకులకు వివిధ కోర్సుల్లో శిక్షణలు, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చందా ప్రసాద్, అల్లూరి రత్నాజీరావు, గూడవల్లి శ్రీనివాస్, చిట్టిబొమ్మ శ్రీను, ఎంపీటీసీలు సున్నం సురేష్, మొడియం వెంకటలక్ష్మి, నాయకులు బూరుగు ప్రేమ్‌కుమార్, కెక్కిరాల రాము, వీరంకి వెంకటేశ్వరరావు, మండల సోషల్ మీడియా కన్వీనర్ నల్లపు హనుమంతు, పేరాబత్తుల వినయ్, దాకారపు నాగేశ్వరరావు, కోర్సా వెంకటేశ్వరరావు, కారం వెంకటేష్, సచివాలయ కన్వీనర్ వెంకటరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళా నేతలు



ఎలీజాకు రాఖీ కడుతున్న మహిళా నేతలు

**జంగారెడ్డిగూడెం:** రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని జంగారెడ్డిగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మహిళా ప్రజా ప్రతినిధులు, నేతలు పెద్దెత్తున ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాకు రాఖీలు కట్టారు. స్వీట్లు, కేక్‌లను తినిపించి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్‌ను కట్ చేశారు. అలాగే జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జికి మహిళలు రాఖీలు కట్టారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాల పద్మ, ఎంపీపీ కొదమ జ్యోతి, మహిళా కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు మహిళా నేతలు పాల్గొన్నారు.

### నేడు ఎర్రవరంలో గడపగడపకు మన ప్రభుత్వం

**బుట్టాయగూడెం:** జీలుగుమిల్లి మండలంలోని వాడపల్లి, ఎర్రవరం నిర్వాసిత కాలనీలతో పాటు చంద్రమ్మ కాలనీలో శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు చందా ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తారని పేర్కొన్నారు. అనంతరం జీలుగుమిల్లి పీహెచ్‌సీ ఆవరణలో నూతన బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### వలంటీర్ సస్పెన్షన్

**చింతలపూడి:** మండలంలోని రాఘవాపురం క్లస్టర్–16 లో వలంటీర్‌ను చింతలపూడి ఎంపీడీవో మురళీకృష్ణ గురువారం సస్పెండ్ చేశారు. వివరాల ప్రకారం రాఘవాపురంలో వివాహితపై గ్రామ వలంటీర్ కోటమర్తి రవికుమార్ లైంగిక వేధింపులకు పాల్పడంతో పాటు, అత్యాచార యత్నానికి పాల్పడ్డాడని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలపై ఎంపీడీవో మురళీకృష్ణ వలంటీర్ రవికుమార్‌ను సస్పెండ్ చేశారు.

### మున్సిపల్ వర్కర్స్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**ఏలూరు (టూటౌన్):** ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 30న జరిగిన జిల్లా ప్రథమ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు విఘ్నేశ్వరరావు, శ్రీనివాస్ తెలిపారు. ఏలూరు జిల్లా అధ్యక్షునిగా కూనపాము విఘ్నేశ్వరరావు, కార్యదర్శిగా భజంత్రీ శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా తొర్లపాటి బాబు, కోశాధికారిగా ముత్యాల నాగేంద్రరావు, ఉపాధ్యక్షులుగా దొడ్డిగర్ల నాగబాబు, సహాయ కార్యదర్శిగా బొక్కా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా శ్రీరామ్ వెంకటయ్య, వెలగాడి అనురాధ, బొత్స రాజేష్, ముప్పిడి సురేష్, కొత్తూరి శ్రీను, కొత్తూరి నాగేశ్వరరావు, చెన్న చంద్రావతి, ఎలగాడ శివకుమార్, బంగారు దుర్గాప్రసాద్, సీహెచ్ నాగేశ్వరరావు, ధనియాల రవీంద్ర, సింగంపల్లి అరుణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆహ్వానితులుగా మడుగుల జగదీష్, పొడుదోలు రమణ, పడిత్య బాలులను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించినట్లు ప్రకటించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్మానించారు. మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తీర్మానించినట్లు నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

### ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బహుజన సేన నాయకులు

**ఏలూరు (టూటౌన్):** ప్రజా గాయకుడు గద్దర్‌కు స్థానిక రామచంద్రరావు పేటలోని బహుజన సేన రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకుడు మత్తే బాబీ మాట్లాడుతూ తన ఉద్యమగానంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశ వ్యాప్తంగా కీర్తింపబడిన గద్దర్ అకాల మరణం తెలుగు ప్రజలు, సామాజిక ఉద్యమకారులకు తీరని లోటన్నారు. గద్దర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. మహనీయుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ ప్రజాయుద్ధం చేయడమే గద్దర్‌కు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో బహుజన సేన రాష్ట్ర మహిళా కార్యదర్శి ఉన్నమట్ల విజయకుమారి, నియోజకవర్గ కన్వీనర్ పిట్టా రాహుల్, జిల్లా మహిళా సభ్యురాలు గండికోట రాణి, తీయాల శరత్, సింగిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అచ్యుత శ్రీనివాసరావు

**జంగారెడ్డిగూడెం:** మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల ప్లస్ పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు సదస్సుకు అధ్యక్షత వహించి మాట్లాడారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు మంచి లక్షణాలు అలవర్చుకొని, ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. బాల బాలికలకు మంచి, చెడు స్పర్శ, స్నేహపూర్వక స్వభావం, దేశభక్తి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. బాల బాలికలు అవాంఛనీయ దాడులు, ఇబ్బందులకు గురైతే వెంటనే ఉపాధ్యాయులకు తెలియపర్చాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మేకల రామమోహన్‌రావు, ఎం.నాగులు, లతా కుమారి, హెచ్‌ఎం పి.గ్లోరి ప్రశాంతి, సోషల్ ఉపాధ్యాయిని ఎం.ప్రమీల రాణి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధర తగ్గింపు ఎన్నికల గిమ్మిక్కే



కొయ్యలగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

**కొయ్యలగూడెం:** గ్యాస్ ధర తగ్గింపు ఎన్నికల నేపథ్యంలో కేంద్రం చేపట్టిన గిమ్మిక్కు అని సీపీఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు పేర్కొన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం పార్టీ కొయ్యలగూడెంలో ర్యాలీ నిర్వహించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో గ్యాస్ ధరను రూ. 800 పెంచి ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని ప్రజలను మభ్యపెట్టేందుకు రూ.200 తగ్గించిందన్నారు. మోడీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా గ్యాస్ సిలిండర్‌ను రూ.400 కే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరెంటును పేద ప్రజలకు యూనిట్ ఒక్క రూపాయికే ఇవ్వాలన్నారు. అధిక ధరలు, నిరుద్యోగాన్ని నియంత్రించలేని మోడీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ప్రజలు గద్దె దింపాలని కోరారు. మతోన్మాద బీజేపీతో స్నేహం కోసం చంద్రబాబు తహతహలాడుతున్నారని విమర్శించారు. కార్యదర్శి ఎస్ శివకుమార్, సోడెం దుర్గారావు, కురసం శంకురమ్మ, యు.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, పోతుపోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ముస్లిం శ్మశానవాటికలో బోర్ నిర్మాణం చేస్తున్న దృశ్యం

**చింతలపూడి:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని చింతలపూడి నగర పంచాయతీ సచివాలయం కన్వీనర్ నిమ్మగడ్డ దుర్గారావు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పుల నాగులు అన్నారు. చింతలపూడి ముస్లిం శ్మశానవాటికలో గురువారం బోర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ముస్లింల అభివృద్ధికి ఎమ్మెల్యే ఎలీజా, ఎంపీ శ్రీధర్ కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా నియోజకవర్గంలోని ముస్లింలకు ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు అందించారన్నారు. పట్టణంలోని ముస్లిం శ్మశానవాటికకు ఇప్పటికే ఎంపీ శ్రీధర్ రూ.10 లక్షలు ఇచ్చి ప్రహరీ పూర్తి చేయించారని, ఎమ్మెల్యే ఎలీజా రూ. 2 లక్షలతో బోర్ వేయించారన్నారు. అలాగే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఉర్దూ పాఠశాల నూతన భవన నిర్మాణం చేపట్టారన్నారు. మసీదు కమిటీ కార్యదర్శి జిలానీ, పెద్దలు అజాద్ ఖాజా, గఫూర్, హాజీ, బక్షు, సుభని తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సహించం



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రమేష్

**కామవరపుకోట:** ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని జెడ్పీటీసీ రమేష్ అన్నారు. గురువారం కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆహార నాణ్యతను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రకారం మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కామవరపుకోట ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, సొసైటీ చైర్మన్ సాయన కనకరాజు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే కరిముల్లా, మేడంకి పద్మావతి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న వైద్యాధికారిణి ఎస్తేరు రాణి

**కొయ్యలగూడెం:** అంకాలగూడెం ఎంపీపీ పాఠశాలను కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బి.ఎస్తేరు రాణి, దంత వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉండటంతో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ఆరోగ్య కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు రక్త నమూనాలు సేకరించి ఫీవర్ సర్వేతో పాటు దంత పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించి, విద్యార్థులకు ఐఎఫ్ఏ టాబ్లెట్లు అందించారు. అలాగే జగనన్న గోరుముద్దను విద్యార్థులతో పాటు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుభద్ర, హెచ్ఎస్ మంగారావు, సీహెచ్‌వో దుర్గ, ఏఎన్ఎం జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రావణ పూర్ణిమ పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం శ్రావణ పూర్ణిమ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్య పూజలు జరిగాయి. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ, గోవింద నామస్మరణ చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయంలో స్వామివారికి గరుడ వాహన సేవ నిర్వహించి సహస్ర దీపోత్సవం నిర్వహించారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పూజలు నిర్వహించగా, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు కొండల అరుణకుమారి, గోకనబోయిన నాగలక్ష్మి, పద్మావతి, లక్ష్మీ పద్మావతి భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి 'ఐలు' కృషి



ఐలు మహాసభలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి

**ఏలూరు (టూటౌన్):** న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) నిరంతరం కృషి చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి తెలిపారు. యూనియన్ ఏలూరు నగర మహాసభ పి.వెకంట్ అధ్యక్షతన స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయవాద గుమస్తాల సంఘ కార్యాలయంలో గురువారం జరిగింది. ముఖ్యఅతిథులుగా మునిస్వామి, మహిళా న్యాయవాదుల రాష్ట్ర కన్వీనర్ ఓరుగంటి శైలజ హాజరయ్యారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఐలు జూనియర్ న్యాయవాదుల ప్రయోజనాల కోసం, న్యాయవాదులకు రాజ్యాంగం, చట్టాల పట్ల అవగాహన కల్పించడానికి సదస్సులు, మోడల్ టెస్టులు నిర్వహిస్తోందన్నారు. శైలజ మాట్లాడుతూ మహిళా న్యాయవాదులు సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఐలు కృషి చేస్తోందన్నారు. ఏలూరులో గత 30 ఏళ్లుగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏలూరు నగర కార్యదర్శి గెద్దా విజయ భాస్కర్ యూనియన్ కార్యకలాపాల నివేదికను వివరించారు. మహాసభలో ఏలూరు నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పి.వెంకట్, కార్యదర్శిగా గెద్దా విజయ భాస్కర్, కమిటీ సభ్యులుగా పి.పరమేశ్వరరావు, వి.శైలజ, ఎస్ఎన్ కట్టా రమేష్‌బాబు, ఎ.శిరీష, కె.మోహనచంద్ర సతీష్, జె.గంగా ఫణీంద్ర లక్ష్మి ఎన్నికయ్యారు. న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, జూనియర్ న్యాయవాదులందరికీ ఐదేళ్ల పాటు నెలకు రూ.10 వేలు రాష్ట్ర ప్రభుత్వం స్టైఫండ్ అందించాలని, వృత్తి శిక్షణ ఇప్పించాలని, ఏలూరు కోటదిబ్బపై ఉన్న పోక్సో కోర్టును అమీనాపేటలోని హాస్టళ్ల ప్రాంగణంలోకి మార్చాలని ఐలు నగర మహాసభ తీర్మానంలో కోరింది.

### ప్రతి ఒక్కరికీ సొంతిల్లు లక్ష్యం

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ మెడికల్ బోర్డు సభ్యుడు డాక్టర్ దిరిశాల వరప్రసాద్ అన్నారు. గురువారం సత్రంపాడు అంబేద్కర్ కాలనీలో మోర్ల సుభద్ర, సురేష్ దంపతులు జగనన్న ఇళ్లలో భాగంగా నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో కేటాయించిన 26 వేల ఇళ్ల లబ్ధిదారులు ఎటువంటి ఆటంకాలు లేకుండా త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకునేలా మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ళ నాని హౌసింగ్ అధికారులను ఆదేశించడమే కాక, ఇళ్ల నిర్మాణలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. సంక్షేమమే కాకుండా ఏలూరు నగరాభివృద్ధి కోసం అమృత నగర్ పథకం ద్వారా కోట్లాది రూపాయలతో పనులు చేపడుతూ నిరంతరం శ్రమిస్తున్న ఆళ్ళ నానిని రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

## మొండికోడులో వైభవంగా సంతోషిమాత ఉత్సవం

**ఏలూరు రూరల్:** కొల్లేరు ప్రజల కొంగు బంగారం శ్రీ సంతోషి మాత పుట్టినరోజు ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఏలూరు మండలం మొండికోడులోని ఆలయంలో ఉదయం 6 గంటలకు అర్చకుడు బొద్దూరి మురళీధర్ శర్మ అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేక పూలు, శతనామ స్తోత్రాలతో పూజలు చేశారు. ఏటా రాఖీ పౌర్ణమి నాడు జరిగే అమ్మవారి ఉత్సవానికి కొల్లేరు గ్రామాల నుంచి అన్నాచెల్లెళ్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం చెల్లెళ్లు అన్నలకు రాఖీ కట్టారు. మహిళలు పండ్లు, పిండి వంటలు, చీరెలు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు గ్రామాల నుంచి భక్తులు కాలినడకన వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మత్స శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆలయ కమిటీ భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసింది.

## సంస్కృతోన్నత పాఠశాలకు వితరణ

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్థానిక బాలగంగాధర తిలక్ నగర పాలక సంస్కృతోన్నత పాఠశాలకు కాశీపట్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన బెంచీలు మరమ్మతులు చేయించడంతో పాటు సౌండ్ బాక్సులు, ఆంపిల్ వైరు, 50 భోజనం ప్లేట్లను అందజేశారు. గురువారం పాఠశాలలో జరిగిన సంస్కృత భాషా దినోత్సవానికి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాశీపట్నపు ఇందుశేఖర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గౌరవ అతిథి, ఫౌండేషన్ కార్యదర్శి శంకర వెంకట సుబ్బారావు మాట్లాడుతూ సంస్కృత భాషపై తనకు ఎనలేని గౌరవం ఉందని, భవిష్యత్‌లో తమ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తామని ప్రకటించారు. సభకు అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీ షడ్రక్ మాట్లాడుతూ భారతీయ భాషలకు మాతృక సంస్కృత భాష అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణపై పోరాటాలకు సిద్ధం కావాలి

**ఏలూరు (టూటౌన్):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇఫ్టూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా గురువారం స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని వీవీ నగర్ ప్రాంతంలో మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన భారీ ప్రదర్శన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ సర్కార్ సంఘటిత, అసంఘటిత, కార్మిక వర్గాల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశ పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశ వ్యాప్తంగా అనేక పోరాటాలు, ఉద్యమాలు, అరెస్టులు, జైలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ సర్కారు పెట్టుబడిదారీ వర్గంలో ఉన్న అదాని, అంబానీలకు అప్పజెప్పేలా పనిచేస్తోందన్నారు. ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీ కార్మిక వర్గానికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు సరైనవి కావన్నారు. కార్మికుల హక్కులను హరిస్తే కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నాయకులు ఘంటసాల రమణ, ఎం.రాము, దూళ్ల వీరినాయుడు, కోరాడ అప్పారావు, పల్లి గంగరాజు, బండి నాగేశ్వరరావు, చిట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

## వైఖానస మహర్షి జయంతి వేడుకలు



స్వామివారికి పూజలు నిర్వహించిన దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** పట్టణంలో వేంచేసియున్న శ్రీవేణుగోపాల స్వామి వారి ఆలయంలో వైఖానస మహర్షి జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి శ్రీస్వామి వారి దేవస్థాన అర్చకులు, వైఖానస పండితులు సమష్టిగా శ్రీస్వామి వారికి పంచామృత అభిషేకం, అష్టోత్తర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సభ్యుడు చిలుకూరి సాయిబాబు మాట్లాడుతూ 28 ఏళ్లుగా ఆలయంలో వైఖానస మహర్షిని ఆరాధించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి ఆలయ ప్రధానార్చకులు వాడపల్లి శేషాచార్యులును దుశ్శాలువాతో సత్కరించారు.

### అమ్మవారికి పల్లకీ సేవ

**జంగారెడ్డిగూడెం:** పట్టణంలో వేంచేసిఉన్న శ్రీశ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి పల్లకీ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. సుదర్శనం వేణుగోపాలాచార్యులు వేద మంత్రోచ్చారణ నడుమ అమ్మవారు పురవీధులలో ఊరేగింపుగా తిరిగి మరలా గుడి ప్రాంగణంలోకి ప్రవేశించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### నూకాలమ్మ ఆలయంలో 54వ చండీహోమం

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని 54వ చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు మనోజ్ శర్మ ప్రభాత పూజలు, నిత్య ఆరాధనలు, నిత్య హారతులు సమర్పించిన అనంతరం అమ్మవారికి షోడశోపచారాలతో పూజ, కుంకుమ పూజ శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయ యాగశాలలో 54వ చండీహోమం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త కనుపర్తి లక్ష్మీ నరసింహ ధనకుమార్ శ్రావణపౌర్ణమి విశిష్టతను, చండీ హోమం ఆవశ్యకతను తెలియజేశారు. కొంకిమళ్ళ కిషోర్ దీపారాణి దంపతులు, బోండాడ బాల శ్రీనివాస్ కళ్యాణీదీప్తి (పెదనింద్రకొలను), బుసనబోయిన వెంకటలక్ష్మి దంపతులు, బుర్ల రత్న కుమారి(కూనవరం) ఉభయదారులుగా వ్యవహరించారు.

### 3వ తేదీన ఆత్మజ్ఞాన ధ్యాన శిక్షణ

**జంగారెడ్డిగూడెం:** పట్టణంలోని శేషాద్రినగర్ శ్రీగౌరీ సుభద్ర పిరమిడ్ ధ్యాన మైత్రేయ మందిరంలో జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ తేదీన ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఒక రోజు ఆత్మజ్ఞాన ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కాకి రామకృష్ణ, తటవర్తి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎన్‌వీ రత్నకుమారి శిక్షకులుగా పాల్గొని 12 ఆధ్యాత్మిక నియమాలు, ఆధ్యాత్మిక సూత్రాల వివరణ అనే అంశంపై శిక్షణ అందజేస్తారని తెలిపారు. శిక్షణలో పాల్గొన్నవారికి మధ్యాహ్నం సాత్విక శాకాహారం అందిస్తామన్నారు. ప్రతినెలా మొదటి ఆదివారం ట్రస్ట్ నిర్వహిస్తున్న ఒకరోజు శిక్షణలో ఆధ్యాత్మిక సాధనా మార్గంలో ఉన్నవారు,. ధ్యానులు, ఇతరులు పాల్గొనాల్సినదిగా ట్రస్ట్ ప్రతినిధులు కోరారు.